క్లుప్తంగా

జగనన్న సురక్షతో అర్హులందరికీ లబ్ధి



పుట్టకొండలో ధ్రువీకరణ పత్రాల పంపిణీ

పెదపూడి: జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులందరికీ లబ్ధి చేకూరుతోందని ఎంపీడీఓ పి.విజయభాస్కర్ అన్నారు. పుట్టకొండలో సోమవారం జరిగిన జగనన్న సురక్ష గ్రామసభకు పుట్టకొండ, చింతపల్లి సర్పంచులు వల్లు వెంకట రమణ, కొల్లు లోవకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.సుభాష్, చింతపల్లి గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కొల్లు సత్తిబాబు, సచివాలయం కార్యదర్శి మనోజ్, వీఆర్వో మంగాలక్ష్మి పాల్గొన్నారు.

నేడు కొంకుదురులో గడప గడపకూ మన ప్రభుత్వం

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలోని గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్టు సోమవారం ఎంపీటీసీ కొంకుదురు పీపీ తెలిపారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి హాజరై ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తారని వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

నరసింహస్వామికి పూజలు

మధురపూడి/సీతానగరం: కోరుకొండలో కొలువుదీరిన శ్రీలక్ష్మీ నరసింహస్వామిని టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి సోమవారం దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీకి పూర్వ వైభవాన్ని తీసుకొస్తానన్నారు. పార్టీ శ్రేణులను ఐక్యంగా నడిపిస్తానన్నారు. తూర్పుగానుగూడెంలోని శివాలయాన్ని సందర్శించిన అనంతరం కోరుకొండ వచ్చినట్టు తెలిపారు. అక్కడి నుంచి సీతానగరం మండలం రఘుదేవపురంలోని సాయిబాబా గుడిలో పూజలు చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, నాయకులు ఉన్నారు.

న్యాయం చేయాలని వినతి



తహసీల్దార్ దొరకయ్యకు వినతిపత్రం అందజేస్తున్న సత్యనారాయణ

రంగంపేట: ఆక్రమణకు గురైన స్థలాన్ని ఇప్పించి తమకు న్యాయం చేయాలని రంగంపేట గ్రామానికి చెందిన ఏడిది సత్యనారాయణ కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందనలో ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం.దొరకయ్యకు వినతిపత్రం అందించి విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రమైన రంగంపేటలో గణపవరపు సుబ్బారావు అనే వ్యక్తి నుంచి సర్వే నంబరు 501లో 195 చదరపు అడుగులు స్థలం కొనుగోలు చేశానని అయితే ఆ స్థలాన్ని దుర్గారావు అనే వ్యక్తి ఆక్రమించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్వే చేసి మా స్థలాన్ని ఇప్పించాలని కోరారు.

ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు

మధురపూడి: క్రైస్తవులందరూ దయ, జాలి, ప్రేమతో మెలగాలని ఆర్‌సీఎంకు చెందిన రెవరెండ్ ఫాదర్ మనోజ్ కుమార్ అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి ఆర్‌సీఎం చర్చిలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ క్రైస్తవులు నిత్యం బైబిల్ పఠనం చేయాలన్నారు. మణిపూర్ రాష్ట్రంలో శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తూ ప్రార్థనలు చేశారు. ఉపదేశి కొల్లి జాకబ్ రాజు, సంఘపెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేత వీరబాబు

గోకవరం: స్థానిక ముస్లిం కాలనీలోని ఎంపీయూపీ ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం సెమిస్టర్–2 పుస్తకాలు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తోలేటి రాంప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

ప్రకాశం నగర్: శ్రీదేవి కళ్యాణ మండపం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కుసుమ నాగన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కమిటీ సభ్యులు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఏడేళ్లుగా తమ విద్యార్థులకు నోట్ పుస్తకాలను ఉచితంగా అందజేస్తున్న శ్రీదేవి కళ్యాణ మండపం కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

వృత్తిలో నిలదొక్కుకునే‘లా’

- ఆర్థిక సాయం అందిస్తున్న ప్రభుత్వం
- యువ న్యాయవాదులకు భరోసానిస్తున్న వైఎస్సార్ లా నేస్తం



అనపర్తి: ప్రజా సంకల్పయాత్రలో న్యాయవాదుల సమస్యలు తెలుసుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు న్యాయవాదులకు భరోసా కల్పించారు. జూనియర్ న్యాయవాదులను ప్రోత్సహిస్తూ వారు వృత్తిలో స్థిరపడేలా ప్రభుత్వం వైఎస్సార్ లా నేస్తం ద్వారా ఆర్థికసాయం అందిస్తున్నారు. దీనిలో భాగంగా అర్హులైన జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5 వేలు చొప్పున ఫిబ్రవరి 2023 నుంచి జూన్ 2023 వరకూ వారి బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం నేరుగా జమ చేసింది.

ఆర్థిక తోడ్పాటు

న్యాయవాద పట్టా చేతపట్టి కళాశాల నుంచి బయటకు వచ్చిన యువ న్యాయవాదులు వృత్తి ఆరంభంలో కక్షిదారుల నుంచి కేసులు రాక అనేక ఒడిదొడుకులకు లోనవుతూ ఉంటారు. దీంతో కొందరు వృత్తిని ఒదిలి వెళ్లే పరిస్థితి.ఈ పరిస్థితుల్ని తెలుసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి జూనియర్ న్యాయవాదులకు వృత్తిపై ఆసక్తి పెంచేలా వారికి నెలకు రూ.5 వేలు స్టైఫండ్‌గా అందించి చేయూతనిస్తామని హామీ ఇచ్చారు. దీనికి అనుగుణంగా అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే హామీని నెరవేర్చేందుకు చర్యలు చేపట్టిన సీఎం జగన్ వైఎస్సార్ లా నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టి అర్హులైన యువ న్యాయవాదులకు మూడేళ్లపాటు నెలకు రూ.5 వేలు చొప్పన ఆర్థికంగా తోడ్పాటును అందిస్తున్నారు.

యువ న్యాయవాదులకు భరోసా



జూనియర్ న్యాయవాదుల సమస్యలను గుర్తించిన సీఎం జగన్ వైఎస్సార్ లా నేస్తం పథకం ద్వారా రూ.5 వేలు చొప్పున అందించడం హర్షణీయం. జూనియర్ న్యాయవాదులకు ఇది ఆర్థికంగా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం రూ.100 కోట్లు కార్పస్ ఫండ్‌తో అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడం సంతోషం.

–వెలగల లక్ష్మీనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు, లాయర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, అనపర్తి

న్యాయవాదులకు ప్రయోజనం



జూనియర్ న్యాయవాదుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని లా నేస్తం పథకం ద్వారా ప్రభుత్వం ప్రతి నెల రూ.5 వేలు స్టైఫండ్ చెల్లిస్తుండడంతో రాష్ట్రంలో వేల మంది జూనియర్ లాయర్లు ప్రయోజనం పొందుతున్నారు. నూతనంగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువ న్యాయవాదులకు కొంత ఆర్థిక పరిపుష్టి కలిగడంతో ఇతర వృత్తులవైపు వెళ్లకుండా ఈ వృత్తిలో నిలదొక్కుకునే అవకాశం ఉంటుంది.

–అయినవిల్లి శేఖర్, జూనియర్ న్యాయవాది, అనపర్తి

జూనియర్లకు ప్రోత్సాహం



జూనియర్ న్యాయవాదులుగా వృత్తిపరంగా ఎదురయ్యే చిన్న చిన్న ఆర్థిక సమస్యలకు తట్టుకునేందుకు వైఎస్సార్ లా నేస్తం తోడుగా నిలుస్తోంది. లా నేస్తం కింద నాకు ఆర్థికసాయం అందుతోంది. ఇది అన్ని వర్గాలకు చెందిన న్యాయవాదులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

–తేతలి శ్యాంప్రసాద్‌రెడ్డి, జూనియర్ న్యాయవాది, అనపర్తి

వృత్తిలో ఉండేలా..



పట్టా చేతపట్టి న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించిన జూనియర్ న్యాయవాదులు తొలి నాళ్లలో అనేక ఒడిదొడుకులు ఎదుర్కొంటారు. న్యాయవాద వృత్తి ప్రారంభించిన లాయర్లు లైబ్రరీ, రవాణా, ఇతర అవసరాలకు కుటుంబ సభ్యులపై ఆధారపడకుండా యువ న్యాయవాదులకు ప్రభుత్వం లా నేస్తం ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తోంది.

–కర్రి విజయలక్ష్మి, జూనియర్ న్యాయవాది, అనపర్తి

ఘనంగా అయ్యంకి జయంతి



గ్రంథాలయంలో అయ్యంకి చిత్ర పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కోటేశ్వరరావు

రంగంపేట: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అఖిల భారత గ్రంథాలయోద్యమానికి విశేష కృషి చేసిన పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య సేవలు చిరస్మరణీయమన్నారు. అదే విధంగా చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా సండే స్టోరీ టైమ్ నిర్వహించి అయ్యంకి జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎం.రామభద్రరావు, కె.దుర్గాప్రసాద్, పాఠకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



బాధితులకు సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజానగరం: జీవనాధారమైన హోటల్ కాలిపోయి నిరాశ్రయులైన కొండగుంటూరుకు చెందిన ఈలి ఆంజనేయులు కుటుంబానికి సోమవారం జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సాయం, నిత్యావసరాలను అందించారు. గ్యాస్ సిలిండర్ పేలడంతో సంభవించిన ఈ ప్రమాదంలో సుమారు రూ.రెండు లక్షల వరకూ ఆస్తినష్టం వాటిల్లింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తక్షణ సాయంగా రూ.10 వేలతో పాటు బియ్యం, నిత్యావసరాలను వైఎస్సార్ సీపీ నాయకుల ద్వారా బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, పార్టీ నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, ఉగ్రింకల శ్రీను, వేమగిరి కృష్ణ, గిరజాల రామకృష్ణ, పెమ్మనబోయిన వెంకటరమణ పాల్గొన్నారు.

గ్రామీణ స్వచ్ఛ సర్వేక్షణ్‌పై విస్తృత ప్రచారం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ: గ్రామీణ స్వచ్ఛ సర్వేక్షణ్ ముఖ్య ఉద్దేశంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం చేపట్టాలని కలెక్టర్ కె.మాధవీలత పిలుపు నిచ్చారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో స్వచ్ఛ ఆంధ్రా మిషన్ కార్పొరేషన్ పంపిణీ చేసిన గ్రామీణ స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ గ్రామాల రూపకల్పన దిశలో గ్రామీణ ప్రజలను భాగస్వాములు చేస్తూ ప్రచారం చేపడుతున్నామన్నారు. ఆ దిశలో ఘన, ద్రవ వ్యర్థాల నుంచి సంపద సృష్టించేలా అడుగులు వేయాలన్నారు. జలజీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ లక్ష్యాలను సాధించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. గ్రామీణ ప్రాంతాల పారిశుధ్య స్థితిని అంచనా వేసే కీలకమైన పరిమాణాత్మక, గుణాత్మక స్వచ్ఛభారత్ మిషన్ (గ్రామీన్) పనితీరు ఆధారంగా జిల్లాలకు ర్యాంకింగ్ ఇస్తారన్నారు. అందులో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేలా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జేవీ సత్యనారాయణ, డ్వామా పీడీ జీఎస్ రామ్‌గోపాల్, జిల్లా ప్రాజెక్ట్ రిసోర్స్ పర్సన్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఏపీడీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో తాత్కాలిక ఉద్యోగి మృతి



దుర్గాప్రసాద్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో తాత్కాలిక ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కోర్టు ఆవరణలో ఓ కార్యాలయాన్ని తెరిచేందుకు సోమవారం ఉదయం 8.30 గంటల సమయంలో సిబ్బంది వచ్చారు. అక్కడ కోర్టులో బెంచ్‌క్లర్క్‌గా ఉద్యోగ విరమణ చేసి ప్రస్తుతం తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్న ఆర్యాపురానికి చెందిన ఆకుల దుర్గాప్రసాద్ (63) విగతజీవిగా పడిఉన్నాడు. వెంటనే సిబ్బంది కోర్టు ఉన్నతాధికారులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి ఇన్‌స్పెక్టర్ మధుబాబు, ఎస్సై అమీనాబేగం చేరుకున్నారు. మృతుడి పక్కనే పురుగు మందు సీసా ఉండడంతో దానిని తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గత రాత్రి అదృశ్యం

ఆకుల దుర్గాప్రసాద్ ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. సోమవారం ఉదయం వరకూ రాకపోవడంతో అతడి కుమారుడు వెంకటసాయి రమణకాంత్ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చాడు. ఈలోపు దుర్గాప్రసాద్ మృతి చెందిన విషయాన్ని పోలీసులు అతడికి తెలిపారు. దుర్గాప్రసాద్ కోర్టు బెంచ్‌క్లర్క్‌గా విధులు నిర్వహించి 2017లో ఉద్యోగ విరమణ చేశాడు. ప్రస్తుతం అక్కడే తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు, కోడలు ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



బొబ్బిల్లంక, ములకల్లంక మధ్య గోదావరిలో బోటుపై ప్రయాణిస్తున్న ప్రజలు

సీతానగరం: అఖండ గోదావరి వరద మధ్యలో ఉన్న ములకల్లంకలో పారిశుధ్యం మెరుగుపై పంచాయతీ కార్యదర్శి రజాక్ ప్రత్యేక దృష్టి సారించారు. సోమవారం గ్రామంలోని వీధుల్లో పేరుకుపోయిన మట్టిని పంచాయతీ పారిశుధ్య కార్మికులు తొలగించారు. చెత్తాచెదారం, వ్యర్థాలను శుభ్రం చేసి, బ్లీచింగ్ వెదజల్లారు. అలాగే బొబ్బిల్లంక, మునికూడలి ఏటిగట్టును ఆనుకుని గోదావరి వైపు నివాసాల వద్ద ఆయా గ్రామ పంచాయతీ అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టారు. బొబ్బిల్లంక నుంచి ములకల్లంక వద్ద గల లంకభూములలో వ్యవసాయం చేసుకునే రైతులు పడవలపై ప్రయాణం సాగిస్తున్నారు. తహసీల్దార్ ఎస్. సత్యనారాయణ, ఎంపీడీవో కె.రమేష్, ఎస్సై కె.చిరంజీవి ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని గమనిస్తూ, సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.

కాటన్ సేవలు చిరస్మరణీయం

రాజమహేంద్రవరం రూరల్: గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను అన్నారు. కాటన్ వర్ధంతి సందర్భంగా ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో బొమ్మూరు కొత్తపేటలో సోమవారం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ముద్దాల అను మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రైతుల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. బొమ్మూరు మాజీ ఉపసర్పంచ్ దాకే శ్రీనివాసరావు, ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజాయోనా పాల్గొన్నారు.

బ్రాస్‌లెట్ చోరీ

రాజమహేంద్రవరం రూరల్: తన కుమార్తె హ్యాండ్ బ్యాగ్‌లోని 8 గ్రాముల బంగారం బ్రాస్‌లెట్ చోరీకి గురైందని ప్రకాశం జిల్లాకు చెందిన పి.విజయకుమారి సోమవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె కుమార్తె జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో ఫైనలియర్ చదువుతూ, లాలాచెరువులోని ఉమెన్ హాస్టల్లో ఉంటోంది. బ్యాగ్‌లో పెట్టిన 8 గ్రాముల బంగారపు బ్రాస్‌లెట్‌ను ఈనెల 16వ తేదీన చూసుకోగా కనిపించలేదు. బొమ్మూరు ఎస్సై జగన్‌మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుల్లా ఆంజనేయులుకు సత్కారం



పుల్లా ఆంజనేయులును సత్కరిస్తున్న సంజీవ్ రెడ్డి

కడియం: విజయవాడలో ఆంధ్ర నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీసత్యదేవా నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులును ఘనంగా సత్కరించారు. ఆంధ్ర నర్సరీ అసోసియేషన్ ప్రెసిడెంట్ సంజీవ్ రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఆంజనేయులుకు శాలువా కప్పి, మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో పుల్లా రాజశేఖర్, నర్సరీ రైతులు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

పేద కుటుంబానికి ఆసరా



నూకాలమ్మకు వర్తించే పథకాల కోసం వివరాలు సేకరిస్తున్న వలంటీర్ కృష్ణవేణి

సీతానగరం: మండలంలోని చినకొండేపూడి పంచాయతీ పరిధి పెదకొండేపూడికి చెందిన కారింగుల నూకాలమ్మ వితంతువు. ఆమెకు కుమార్తె దివ్యాంగురాలు. వారికి అన్ని విధాలా ఆసరాగా వలంటీర్ పాలెపు కృష్ణవేణి నిలుస్తోంది. నూకాలమ్మకు, ఆమె కుమార్తెకు పింఛన్లను ప్రతినెలా ఠంఛన్‌గా అందజేస్తోంది. ప్రభుత్వ పథకాలపై వారికి అవగాహన కల్పిస్తూ, వారికి వర్తించే వాటి కోసం దరఖాస్తులు పూర్తి చేసి సాయపడుతోంది. కోవిడ్ సమయంలోనూ సేవలు అందించింది. రెక్కాడితేనే కాని డొక్కాడని ఆ కుటుంబానికి ఆసరాగా ఉంటోంది.

పలు పథకాలు వచ్చాయి



వలంటీర్ కృష్ణవేణి మాకు అన్నివిధాలా అండగా ఉంటోంది. మాకు ఏ పత్రాలు కావాలన్నా ఎనిమిది కిలోమీటర్లు దూరంలో సీతానగరంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలి. అయితే ఆ శ్రమ లేకుండా వలంటీర్ సాయపడుతోంది. జగనన్న చూయూత, ఆసరా పథకాలకు కావాల్సిన పత్రాలను ఆమే సిద్ధం చేసింది. వలంటీర్ వల్లనే ప్రభుత్వ పథకాలు పొందుతూ సంతోషంగా జీవిస్తున్నాం.

– కారింగుల నూకాలమ్మ, పెదకొండేపూడి

హోరువాన

ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువలు



గోకవరం శివారులో రంపయర్రంపాలెం రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు



రంగంపేటలో కురుస్తున్న వర్షం

గోకవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండల వ్యాప్తంగా సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. భారీ వర్షాలకు చెరువులు, కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. గోకవరం శివారున రంపయర్రంపాలెం వెళ్లే మార్గంలో చెరువు పొంగడంతో రహదారిపై నీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఏజెన్సీలో కురిసిన భారీ వర్షాలకు ఊరకాలువలోకి వరద నీరు చేరడంతో ఉధృతంగా ప్రవహించింది. సంజీవయ్యనగర్‌లోని సప్టాపై ఊరకాలువ ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. గోకవరం ఠాణాసెంటర్‌లో వంతెన, విద్యుత్ సబ్‌స్టేషన్, డ్రైవర్స్ కాలనీల వద్ద ఊరకాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది.

తడిసిముద్దయిన మెట్ట

రంగంపేట: మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలంలో సోమవారం తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు వర్షం కురుస్తూనే ఉంది. దీనితో జన జీవనం స్తంభించింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై ఉన్న గోతుల్లో నీరు చేరడంతో రాకపోకలకు ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా ఈ వర్షం వరిసాగు చేసే రైతులకు ఎంతో ఉపయోగపడనుంది. నారుమడులు ఎదుగుదలకు, ఆకుతీతకు, దమ్ము చేయడానికి, నాట్లు వేయడానికి వీలుగా మడులలో నీరు చేరింది. ఇప్పటికే వరినాట్లు వేసిన చేలకు ఈవర్షం ఊపిరిపోసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో మెట్టలో వరినాట్లు ముమ్మరంగా సాగనున్నాయి.

అపర భగీరథుడు కాటన్ సేవలు చిరస్మరణీయం



కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి తదితరులు

అనపర్తి: ధవళేశ్వరం వద్ద గోదావరి నదిపై ఆనకట్ట నిర్మించి గోదావరి పరీవాహక ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడం ద్వారా ఈ ప్రాంత ప్రజల జీవనశైలిని మార్చిన దార్శనికుడు సర్ ఆర్థర్ కాటన్ మహాశయుడని ఏఎంసీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. కాటన్ 124వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం మండలంలోని రామవరంలోని కాటన్ విగ్రహానికి కృష్ణారెడ్డితోపాటు పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ గోదావరి జిల్లాలు ఇంత సుభిక్షంగా ఉన్నాయంటే దానికి కాటన్ దొరే కారణమని, ఆయన నిర్మించిన ఆనకట్ట వల్లే ఉభయ గోదావరి జిల్లాల్లో బీడు భూములు పంట భూములుగా మారాయన్నారు. లక్షల ఎకరాలు సాగులోకి తేవడంతో అన్నదాతలకు అన్నం పెట్టిన దాతగా కాటన్ వెలుగొందుతూ ఉభయ గోదావరి జిల్లా వాసుల మనస్సుల్లో కాటన్ చిరస్థాయిగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, పార్టీ మండల అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, పార్టీ జిల్లా రైతు విభాగం నాయకులు నలమాటి భీముడు, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి, పార్టీ గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి జీఎంఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి



తొర్రేడులో రోడ్లను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- తొర్రేడులో రోడ్లు, డ్రైనేజీల పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామంలోని రోడ్లు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. సోమవారం ఆయన తొర్రేడు గ్రామంలో ముంపునకు గురైన రోడ్లు, డ్రైనేజీలను పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆర్అండ్‌బీ రోడ్డు నీటమునగడంతో ఆశాఖ జేఈ జి.వీరన్నబాబు, పార్టీ నాయకులతో కలిసి చందన నాగేశ్వర్ ఆ ముంపునకు గల కారణాలను తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో నీరు ముందుకు వెళ్లడం లేదని, ఏటా వర్షాకాలంలో సమస్య తలెత్తుతోందని పార్టీ నాయకులు వివరించారు. వర్షం నీరు నిల్వ ఉండడంతో ఆర్అండ్‌బీ రోడ్డు పూర్తిగా దెబ్బతింటోందన్నారు. రోడ్లు, డ్రైనేజీల సమస్యలు ఉత్పన్నం కాకుండా శాశ్వత పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మండల ఇంజినీరింగ్ అధికారి సంపత్ కుమార్, ఆర్అండ్‌బీ జేఈ వీరన్నబాబును చందన ఆదేశించారు. కార్యక్రమంలో హుకుంపేట సొసైటీ చైర్‌పర్సన్ చిట్టూరి వెంకటరావు, పార్టీ నాయకులు ఉప్పులూరి రాము, దండమూడి అర్జునరావు, గద్దె సుబ్బారావు, దాసరి గోపాలకృష్ణ, మిరియం నెహ్రూ, పాలడగుల శ్రీధర్, పాలడగుల వెంకటేష్ పాల్గొన్నారు.

21, 22వ తేదీల్లో ఎన్జీవో మహాసభలు

రాజమహేంద్రవరం సిటీ: విజయవాడలో ఆగస్టు 21, 22వ తేదీల్లో నిర్వహించే ఏపీ ఎన్జీవో 21వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ ఎన్జీవో నగర అధ్యక్షుడు వైవీఎస్ నాయుడు కోరారు. సోమవారం నగర ఎంజీవో హోమ్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతారన్నారు. రాజమహేంద్రవరం నగర శాఖ నుంచి సుమారు 500 మంది మహాసభలకు తరలివెళ్లాలన్నారు. సమావేశంలో నగర కార్యదర్శి ప్రవీణ్ కుమార్, రాష్ట్ర జేఏసీ కార్యదర్శి వేణుమాధవ్, నగర సహాధ్యక్షుడు అనిల్ కుమార్, ప్రతినిధులు మాధవరావు, ప్రతాప్, దురాని, రాఘవరావు, రాజు పాల్గొన్నారు.